

గద్వాల-అయిజ రోడ్డు దుస్థితి

ఎన్నాళ్లీ దారిద్ర్యం?

పేరుకే జిల్లా కేంద్రం. ప్రధాన రోడ్లు మాత్రం పూర్తిగా అధ్వానం. జిల్లా కేంద్రంలోని క్రిష్ణవేణి చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, రెండో రైల్వేగేటు, రాజీవ్‌మార్గ్, గద్వాల–అయిజ రహదారి గుంతలమయంతో ఛిద్రమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నీరు గుంతల్లో నిలిచి చెరువులను తలపిస్తూ ఏ గుంత ఎంత లోతు ఉందో కనిపించక వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్లలో ప్రయాణం చేయాలంటే వాహనదారులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. కొన్నెళ్లుగా రోడ్లు గుంతలయమంగా ఉన్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు మాత్రం మరమ్మతులు చేపట్టకుండా చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– గద్వాల అర్బన్



అంబేద్కర్ చౌరస్తాలో గుంతలమయంగా రోడ్డు



జమ్మిచేడు వద్ద రోడ్డు ఇలా

క్లుప్తంగా

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

గద్వాల రూరల్: గద్వాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత సోమవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కోరారు. మంగళవారం నుంచి జరిగే బడ్జెట్ సమావేశాల్లో నియోజకవర్గంలోని రహదారులు, పరిశ్రమల ఏర్పాటు, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులకు అధిక నిధులు మంజూరు చేయాలని కోరారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థి ఎంపిక

ధరూరు: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు మంచిర్యాల జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పదో తరగతి విద్యార్థి శ్రీనాథ్ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు వారు తెలిపారు. ఆగస్టులో మహారాష్ట్రలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో శ్రీనాథ్ పాల్గొంటాడని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కోచ్ రషీద్‌లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కరాటే పోటీలో ప్రతిభ చాటిన విద్యార్థులు

ఉండవెల్లి: ఫస్ట్ ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే – డో చాంపియన్ షిప్ 2024 పోటీలు సోమవారం కర్నూలులో నిర్వహించారు. ఈ పోటీలకు ఐదు రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొనగా ఉండవెల్లి ఉన్నత పాఠశాలకు చెందిన లావణ్య (10వ తరగతి) మొదటి స్థానంలో గోల్డ్ మెడల్ సాధించింది. రెండో స్థానంలో మౌనిక, శివలక్ష్మి సిల్వర్, మూడో స్థానంలో ఇందు, విజయలక్ష్మి, మహేశ్వరి, శ్రావణి బ్రౌంజ్ మెడల్ సాధించారు. హెచ్‌ఎం హేమలత, పీడీ శైలజ, మాస్టర్ రాము విద్యార్థులను అభినందించారు

రెడ్డి సేవా సమితికి రూ.2 లక్షల విరాళం

గద్వాల: బీజేపీ నాయకుడు లక్ష్మీకేశవరెడ్డి జిల్లా రెడ్డి సేవా సమితికి రూ.2 లక్షల విరాళం అందజేశారు. సోమవారం తన నివాసంలో రూ.2 లక్షల చెక్కును రెడ్డి సేవా సమితి నాయకులకు ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులతో విద్యకు దూరమవుతున్న పేద రెడ్డి సామాజిక వర్గం పిల్లల చదువులకు సమితి తరుపున తమవంతు కృషి చేస్తున్నామని రెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటరాజా రెడ్డి తెలిపారు. సమితి నాయకులు రంగా రెడ్డి, బహుదర్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వీరేష్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మద్యం బాబులపై కేసు నమోదు

రాజోళి: బహిరంగంగా మద్యం తాగిన వ్యక్తులపై మండల కేంద్రంలో పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తగా వచ్చిన చట్టాల ప్రకారం మద్యం తాగుతూ పట్టుబడిన వారిపై ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు జరిమానా ఉంటుందని ఎస్‌ఐ జగదీష్ తెలిపారు. మద్యం తాగే వారు ప్రభుత్వం నిర్దేశించిన చోట మాత్రమే మద్యం తాగాలని, ఎక్కడబడితే అక్కడ తాగితే కేసులు తప్పవని హెచ్చరించారు. సోమవారం 5 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

ఎర్రవల్లిచౌరస్తా: కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అయూబ్ సోమవారం సూచించారు. 2024 జూన్ 28వ తేదీ వరకు కొత్త పాసు పుస్తకం పొందిన రైతులు, గతంలో దరఖాస్తు చేసుకోని వారు నమోదు చేసుకోవాలని తెలిపారు.

శివాలయంలో అభిషేకం

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి అభిషేకం చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శివున్ని దర్శించుకున్నారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వండి

● కలెక్టర్‌కు తాజా మాజీ సర్పంచ్‌ల వినతి

అలంపూర్: సర్పంచ్‌ల పదవీ కాలంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు తక్షణమే మంజూరు చేయాలని ఉండవెల్లి మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లోకేశ్వర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ బీఎం సంతోష్‌ను ఉండవెల్లి మండల తాజా మాజీ సర్పంచ్‌లు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో సర్పంచ్‌లుగా పదవిలో ఉన్న సమయంలో పంచాయతీల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాల, తాగునీటి నిర్వహణ, పల్లె ప్రగతిలో భాగంగా డ్రైయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణం, ఎర్రమట్టి రోడ్ల నిర్మాణం, ఇంకుడు గుంతలు, క్రీడా మైదానాల వంటి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. చేసిన పనుల ఎంబీలు పూర్తి చేసినా పదవీ కాలంలో బిల్లులు అందలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, రైతు వేదిక వంటి భవనాలు, పంచాయతీ భవనాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఇలా ప్రభుత్వం చెప్పి పనులు పూర్తి చేయడానికి అప్పులు తెచ్చినట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలంలో ఒక్కొక్క గ్రామ ప్రచాయతీకి రూ.2లక్షల నుంచి రూ.15 లక్షల వరకు డబ్బులు రావాల్సి ఉందన్నారు. తాజామాజీ సర్పంచ్‌ల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సురవరం లోకేశ్‌రెడ్డి, శేషన్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, నగేష్, నరేంద్ర నాయుడు, శివరాములు, భాస్కరయ్య, బజారన్న, మజీద్ మియ్య, ఆత్మలింగారెడ్డి, తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న తాజా మాజీ సర్పంచ్‌లు

విద్యారంగ సమస్యలపై కలెక్టర్‌కు వినతి

గట్టు: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్‌కు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2018 నుంచి ఎంపీసీ, బైపీసీ సైన్స్ గ్రూపులను మంజూరు చేశారని, బోధించడానికి అధ్యాపకులను నియమించక పోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. అతిథి అధ్యాపకులను నియమించి, జీతాలు చెల్లించలేక పోతున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే చెల్లించాలని కోరారు. గట్టు, ఆరగిద్ద ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. గట్టు మండలం నుంచి 30 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా, 8 మంది మాత్రమే ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, డీఎస్సీ నుంచి కొత్తగా ఉపాధ్యాయులు వచ్చే వరకు విద్యావలంటీర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు హలీంపాష తెలిపారు.

పాఠశాలల్లో వసతులు కల్పించాలి

రాజోళి: మండలంలోని అన్ని పాఠశాలల్లో వసతులు, సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించాలని ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ సంతోష్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం కలెక్టర్‌ను కలిసిన వారు పలు పాఠశాలల్లో భవన సమస్యలతో పాటుగా, వసతులు లేకపోవడం, ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందని, ఇలాంటి సమస్యలపై దృష్టి పెట్టి, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల కో ఆర్డినేటర్ హనిమిరెడ్డి, ఆయా గ్రామాల పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పాత బస్టాండ్‌లో మురుగు నీటిపై బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

అయిజ: మున్సిపాలిటీలోని 20 వార్డులకు సంబంధించిన వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు శనివారం 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం చేపట్టింది. పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన ప్రజలు ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఫోన్ ద్వారా మున్సిపల్ కమిషనర్ సత్యంబాబు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారు. అయితే ఆది, సోమవారాల్లో సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు పనులు చేపట్టారు. వివిధ కాలనీల్లో రాత్రి సమయంలో ఫాగింగ్ చేశారు. మురుగు ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. డ్రైయినేజీల్లో పూడికను ఎత్తివేశారు. చెత్తను సేకరించే వాహనాలను అన్ని కాలనీలకు పంపారు. గుంతలు పూడ్చే కార్యక్రమాలు చేపట్టారు. త్వరలోనే సీసీ రోడ్లు, డ్రైయినేజీలు నిర్మిస్తామని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. ఫోన్‌ఇన్ కార్యక్రమంతో అధికారులు స్పందించడంతో పట్టణంలో దోమల బెడద కొంతమేరకు తగ్గిపోయింది.

విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

మానవపాడు: మండలలంలోని చెన్నిపాడు, అమరవాయి, గోకులపాడు గ్రామాల రోడ్ల వెంట ఒరిగిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఎప్పుడు పడిపోతాయోనని ప్రయాణికులు రోడ్లపై బిక్కుబిక్కుమంటూ వెళ్లే వారు. ఈ నెల 15న 'ఒరిగిన స్తంభాలు.. సరిచేయని అధికారులు' కథనం 'సాక్షి' దినపత్రికలో రావడంతో విద్యుత్ అధికారులు స్పందించారు. సోమవారం నాలుగు ఒరిగిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టారు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



విద్యుత్ స్తంభాన్ని సరిచేస్తున్న విద్యుత్ అధికారులు

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు



మల్దకల్: రైతులకు అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ సంగీతలక్ష్మి ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులను హెచ్చరించారు. సోమవారం ఎల్కూరు, మల్దకల్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు రైతులకు ఎరువులను విక్రయించిన వెంటనే రశీదులు ఇవ్వాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా షాపు యజమానులతో రశీదు పొందాలన్నారు. ఫర్టిలైజర్ షాపులలో ఈ పాస్ మెషిన్ ద్వారానే మందుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని, స్టాక్ వివరాలను రికార్డుల్లో పొందు పరచాలన్నారు. అనుమతి లేని ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చే స్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్, ఏఈఓ కిశోర్‌కుమార్, ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

రాజోళి: మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ హరికృష్ణ కు వినతి పత్రం అందజేశారు. గతంలో స్థానికంగా నమోదు కేంద్రం ఉన్నప్పటికీ, ప్రస్తుతం నమోదు కేంద్రం వర్క్‌లో లేదని, మండలంలోని ప్రజలు ఆధార్‌లో సవరణలు, కొత్త ఆధార్ నమోదు వంటి విషయాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులు, యువకులు, వృద్దులు ఆధార్ అవసరాల కోసం పక్క రాష్ట్రం కర్నూల్‌కు వెళ్లి ఆధార్ నమోదు చేసుకోవాల్సి వస్తుందన్నారు. త్వరగా ఆధార్ నమోదు కేంద్రం రాజోళిలో ఏర్పాటు చేస్తే, వృద్దులు, దివ్యాంగులు, చిన్న పిల్లలకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, బొజ్జన్న, గిడ్డన్న, ఆనంద్ బాబు, నవీన్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై పోలీసుల సూచనలు

అలంపూర్: ప్రతి ఒక్కరూ మొబైల్‌లో వచ్చే లోన్ యాప్స్‌పై మోసపోవడంతో ఇబ్బందులు పడకుండా సైబర్ క్రైంకు సమాచారం అందించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు ప్రజలకు తెలిపారు. అలంపూర్ చౌరస్తాలోని ఫ్లైఓవర్ కింద ప్రయాణికులకు, యువకులకు, లోన్ యాప్స్, పలు సమస్యలపై వేధిస్తున్న వెంటనే 100కు, లేదా 1930కు కాల్ చేయాలని ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నాగేష్, అబ్దుల్, ఖాదర్ బాషా పాల్గొన్నారు.



ఇటిక్యాలలో బాలల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాలల సంరక్షణపై అవగాహన

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి శివ హాజరై మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థతో పాటు బాలల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య, ఐసీపీఎస్ పోనిక్ రవి, చైల్డ్‌లైన్ టీం స భ్యులు జ్యోతి, శిరీష, యాదగిరి ఉన్నారు.

మానవపాడు: బాలబాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ వాహీదా ఖాతూన్, బాలల సంరక్షణ అధికారి జోగు రవి అన్నారు. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు అవగాహన కల్పించారు. బాలికలు, మహిళలు హింసకు గురైతే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1098, 100 కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అస్మా, చైల్డ్ లీగల్ ఆఫీసర్ శివయ్య, మెడికల్ ఆఫీసర్ యాకుబ్‌బాషా, చంద్రన్న, సఖి సభ్యురాలు శోభ, ఉమెన్ ఉన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

గద్వాల వ్యవసాయం: నడిగడ్డలో మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ పుల్లూరు గోపాల్ రాష్ట్ర మత్స్యకార ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు విన్నవించారు. సోమవారం ఆయనను హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మత్స్యకారుల సమస్యలు పరిష్కరించడంతో పాటు, వారి అభివృద్ధికి సహకారం అందిస్తామని సాయికుమార్ భరోసా ఇచ్చారు.



రాష్ట్ర మత్స్యకార ఫెడరేషన్ చైర్మన్‌కు బొకె అందజేస్తున్న పుల్లూరు గోపాల్, మద్దిలేటి

గర్భిణులు వైద్యపరీక్షలు చేయించుకోవాలి

మల్దకల్: గర్భిణులు ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ జయమ్మ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ శ్రీధర్, జ్యోతి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: నియోజకవర్గంలోని పేదలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సోమవారం సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీని అందజేశారు. అలంపూర్ మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన కమలమ్మకు ఆపరేషన్ కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆమెకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.1.50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఎల్‌ఓసీని కమలమ్మ కుమారుడు మధుకు అందజేశారు. వారితో పాటు నాయకులు వావిలాల రంగారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, కిషోర్, చందు, ఉన్నారు.



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అల్లీపీర స్వామి ఆరాధనోత్సవాలు

అయిజ: సద్గురు అల్లీపీర స్వామి ఆరాధనోత్సవాలు రాత్రి మండల కేంద్రంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సదర్గురు గుడికల్లు పీఠాధిపతి గురు గాజి హుస్సేన్, ఆయన శిష్యుడు హమీద్ హుస్సేన్‌లు హాజయ్యారు. ఉత్సవాలకు కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పీఠాధిపతిని దర్శించుకున్నారు. వారిని పీఠాధిపతి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా గుడికల్లు పీఠాధిపతి గురు గాజి హుస్సేన్ మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఒత్తిడిని జయించవచ్చన్నారు. ప్రతి ఒక్కరు హింసను వీడి, అహింసా మార్గంలో నడవాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భజన బృందాల సభ్యులు సోమవారం తెల్లవారు జాము వరకు భక్తి గీతాలు ఆలపించారు. నిర్వాహకులు భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న పీఠాధిపతి గురు గాజి హుస్సేన్

సాహిత్యంపై ఆసక్తి పెంచుకోవాలి

గద్వాల అర్బన్: విద్యార్థులు సాహిత్యంపై ఆసక్తిని పెంచుకొని కవిత్వం రాసే స్థాయికి ఎదగాలని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. దాశరథి కృష్ణమాచార్యుల జయంతి సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో దాశరథి కృష్ణమాచార్యుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీపతినాయుడు, అధ్యాపకులు నర్సింహులు, హరిబాబు, నాగభూషణం, శంకర్, తదితరులు ఉన్నారు.



దాశరథి కృష్ణమాచార్యుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

సమస్యలపై నిరంతరం పోరాటం

గద్వాల అర్బన్: నడిగడ్డలోని సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ సమితి కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజకీయ పార్టీపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, కార్యదర్శి లవన్న, ఆయా మండలాల అధ్యక్షులు విష్ణు నాయుడు, బలరాం నాయుడు, గోవిందు, లక్ష్మణ్ ఉన్నారు.

రుణమాఫీ రైతులు ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్త

మానవపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుల రుణమాఫీ అదునుగా తీసుకొని సైబర్ నేరస్తులు వివిధ బ్యాంకుల పేరుతో సైబర్ నేరాలకు పాల్పడతారని, ప్రతి రైతు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ చంద్రకాంత్ సూచించారు. సోమవారం మండలంలోని అమరవాయిలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు రుణమాఫీ అయిపోయిందని ఆనందంలో సైబర్ నేరాస్తుల వాట్సప్ ప్రొఫైల్ ఫొటో, బ్యాంకు లోగోలతో మోసపూరితమైన లింకులు పంపి మోసాలకు పాల్పడతారని, లింకులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు నుంచి వచ్చేవిధంగా మెసేజ్‌లు పంపి ఓటీపీలు అడుగుతారని, ఎవరూ చెప్పవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఏదైనా సందేహాలు ఉంటే బ్యాంకులను, పోలీస్‌లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, రైతులు పాల్గొన్నారు.



అమరవాయిలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చంద్రకాంత్

భగీరథ నీళ్లురాక ఇబ్బందులు

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో ప్రజలు బోర్లు వద్ద క్యూలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మిషన్ భగీరత నీటి కోసం పడిగాపులు కాస్తున్నారు. ఇంటింటి నల్లా కనెక్షన్‌తో నీరు రాకపోవడంతో దూరం ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ బోరు వద్ద క్యూలో ప్రజలు బిందెలతో వేచి ఉండి నీటిని తీసుకెళ్తున్నారు.

మరమ్మతుకు నోచుకోక ప్రమాదాలు

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని చౌక్‌బజార్ రాహదారి మలుపులో మురుగు కా ల్వకు మరమ్మతు చేపట్టక పోవడంతో తరుచు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రధాన కూడలి కావడంతో నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి. ఇక్కడ తిరిగే వాహనాలు, ప్రజలు కాల్వలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. సోమవారం భైరంపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు వాహనంపై వస్తూ మలుపు దగ్గర అదుపు తప్పి కాల్వలో పడ్డాడు. చేతికి, నడుముకు గాయాలయ్యాయి. అతనిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఎన్ని సార్లు ప్రమాదాలు సంభవించినా అధికారులు పట్టించుకోవడంలేదని షేక్ అహ్మద్, హాజిబాషా, బంగారు బాబు, మురళి, లైక్ అహ్మద్, రవికుమార్, శేఖర్‌గౌడ్, పేర్కొన్నారు.

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల నిరసన



లింగన్‌వాయిలో పాఠశాల దగ్గర నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

అలంపూర్ రూరల్: పాఠశాలకు రక్షణ గోడ లేదని, పిల్లలకు రక్షణ ఎలా ఉంటుందని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు జీకే ఈదన్న ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు. మండలంలోని లింగన్‌వాయి గ్రామంలో ఎంపీపీఎస్ హరిజనవాడ పాఠశాలకు రక్షణ గోడ లేకపోవడంతో పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని జీకే ఈదన్న తెలిపారు. కొన్ని సంవత్సరాల నుంచి నాయకులు, అధికారులు ప్రహరీ గోడ నిర్మిస్తామని చెప్పినా, ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని కోరారు.